క్లుప్తంగా

స్కూల్ కౌన్సిల్ ఎన్నికలతో నాయకత్వం

కురబలకోట : స్కూల్‌లో విద్యార్థులకు ఎన్నికలు నిర్వహణ ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అంగళ్లులోని విశ్వం విద్యా సంస్థల అధినేత ఎం. ప్రభాకర్ రెడ్డి అన్నారు. సీబీఎస్‌సీ స్కూల్‌లో కౌన్సిల్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికైన వారితో బుధవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ఎన్నికల ద్వారా ప్రజా స్వామ్య విలువలు, ఓటు హక్కు వినియోగం, మాట్లాడే నైపుణ్యంతో పాటు విభిన్న కోణాల్లో ప్రతిభ బయటపడుతుందన్నారు. సమన్వయం అలవడుతుందన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన విద్యార్థులు స్కూల్ విలువలను కాపాడతామని అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ప్రిన్సిపల్ రోజ్లిన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



విద్యుత్‌సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

పీలేరు : మండలంలోని దొడ్డిపల్లె పంచాయతీలో రూ. 3.50 కోట్లతో కొత్తగా ఏర్పాటు చేసి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. బుధవారం సబ్‌స్టేషన్ వద్ద పూజలు నిర్వహించి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూలో ఓల్టేజీ సమస్యను అధిగమించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సమష్టి నిర్ణయాలతో శాశ్వత విజయాలు



మాట్లాడుతున్న చాముండేశ్వరి

కురబలకోట : సమష్టి నిర్ణయాలతో శాశ్వత విజయాలు సాధ్యమవుతాయని సైకాలజీ స్పెషలిస్టు, స్టూడెంట్ కౌన్సిలర్ డాక్టర్ అన్నమరెడ్డి చాముండేశ్వరి అన్నారు. అంగళ్లులోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో సంస్థ శ్రేయస్సు-ఒక సంయుక్త బాధ్యత అంశంపై బిటెక్ విద్యార్థులకు జరిగిన సెమినార్‌లో ముఖ్య అతిథిగా మాట్లాడారు. సంస్థ శ్రేయస్సు అంటే యాజమాన్య నియంత్రణ కాదని సమష్టి బాధ్యత అన్నారు. కలసి కట్టుగా నడవడం వల్ల సంస్థలు, వ్యవస్థలు సమర్థవంతంగా కొనసాగుతాయన్నారు. అభివృద్ధికి మూలంగా మారుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత అభివృద్ధే కాకుండా జీవనశైలిని మెరుగుపరచుకోవాలన్నారు.

క్రమశిక్షణతో అభ్యసిస్తే ఉన్నతంగా ఎదగవచ్చు

– మోటివేటర్ రామనాథన్



మాట్లాడుతున్న రామనాథన్

కురబలకోట : విద్యార్థులు క్రమశిక్షణతో అభ్యసిస్తే ఉన్నతంగా ఎదగవచ్చని మోటివేటర్ రామనాథన్ అన్నారు. అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ బీటెక్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మిషన్ లర్నింగ్ విభాగం వారు బుధవారం తల్లిదండ్రుల సమా వేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు బిడ్డల భవిష్యత్తు కోసం ఎన్నో కలలు కంటారన్నారు. విద్యతో ఎదగడం మనిషికే కాదు సమాజాన్ని కూడా మేల్కొలుపుతుందన్నారు. పాఠ్యాంశాలతో పాటు విలువలు, మానవత్వం, వినయం, నైతికత కూడా విద్యార్థులకు అవసరమన్నారు. విత్తనంలో చెట్టు దాగి ఉన్నట్లు చదువులో విద్యార్థుల భవిష్యత్తు ఇమిడి ఉంటుందన్నారు. ముఖ్యంగా శ్రద్ధ, పట్టుదల, క్రమశిక్షణ, డబ్బుతో పాటు కాలం విలువ తెలిసిన విద్యార్థులు ఎలాంటి రంగంలోనైనా ఉన్నతంగా రాణించగలరన్నారు. లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకోగలుగుతారన్నారు. ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా అవసరమన్నారు.

వెలుగు పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం



వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మదనపల్లె సిటీ : స్థానిక అమ్మచెరువుమిట్ట వద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాలలోని చిన్నారులు, వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్, మెడికల్ ఆఫీసర్ దివ్య, వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



చంద్రబాబు మోసాలపై క్యూఆర్ కోడ్ ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

- ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజం
- మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు (వాల్మీకిపురం) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే ప్రజా విశ్వాసం కోల్పోయిందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. అలవికాని హామీలు ఇచ్చి ప్రజలను మోసగించడం రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు నైజమన్నారు. బుధవారం వాల్మీకిపురంలోని ఓ కల్యాణమండపంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఎందుకు ఓట్లు వేశామా అని బాధపడుతున్నారని తెలిపారు. అన్ని సామాజిక వర్గాల్లో టీడీపీకి ఓట్లు వేసి తప్పు చేశామనే భావన నెలకొందని చెప్పారు. అమరావతిలో ఒక్క రైల్వేకి 1300 ఎకరాలు కేటాయించడంలో మతలబు ఏంటో చంద్రబాబుకే తెలియాలన్నారు. అమరావతిలో మూడు పంటలు సాగు అయ్యే భూములను 40 వేల ఎకరాలు సేకరించడం కూటమి నాయకుల స్వప్రయోజనాలకోసమేనని ఆరోపించారు. వై.ఎస్. జగన్ ప్రభుత్వంలో విద్యకు, వైద్యానికి అధిక ప్రాధాన్యతచ్చారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సంక్షేమాన్ని గాలికి వదలి వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు కలసి కట్టుగా పని చేసి వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. గత ఎన్నికల్లో ఈవీఎంలు ట్యాంపరింగ్ జరిగినట్లు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పెద్ద ఎత్తున ఎన్నికల కమీషన్‌పై విమర్శలు చేస్తున్నారని, తమకు కూడా అనుమానం ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి చంద్రబాబు మోసాల గూర్చి పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నిర్మలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతల శివానందరెడ్డి, నీళ్ల భాస్కర్, అశోక్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, కేశవరెడ్డి, నాగేంద్ర, కలీమ్, శివకుమార్‌రెడ్డి, ఆనంద్, శ్రీధర్‌రాయల్, కువైట్ ఇబ్రహీం, మల్లీశ్వరి, గంగులమ్మ తదితరులు పాల్గొన్నారు

చంద్రబాబు మోసాలను నిలదీయండి

నిమ్మనపల్లె మండలంలో బాబు షూరిటీ- మోసం గ్యారంటీ



చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నిమ్మనపల్లె : ఏడాదిన్నర పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన మోసాలు, తప్పులను ప్రజలు నిలదీయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కొమ్మెపల్లి శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, పంచాయతీరాజ్ విభాగ అధ్యక్షులు రెడ్డి శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొండయ్యగారిపల్లె నిమ్మనపల్లె, వెంగంవారిపల్లె, గ్రామపంచాయతీలలో బాబు షూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి, ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలను మోసం చేయడానికి ఇచ్చిన హామీల చిట్టాను వివరించారు. కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలు ఏమైనా నెరవేర్చారా? అంటూ స్థానికులను అడిగారు. సంక్షేమ పథకాలకు అనేక కొర్రీలు పెట్టి, అధిక శాతం లబ్ధిదారులకు ఇవ్వకుండా మోసం ఎలా చేశారో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతిపక్షాలను వేధించడమే ప్రధాన ఉద్దేశంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పాలన పక్కదారి పట్టించి, అభివృద్ధిని విస్మరించి, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ లు నవాజ్ హుస్సేన్, రుకియా బేగం, బీరంగి రేవతి, కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, రామ్మోహన్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, శశిధర్ రెడ్డి, ఉదయ శేఖర్ రెడ్డి, ఎర్రయ్య, గడ్డం నరసింహారెడ్డి, రెడ్డి భాస్కర్, హేమంత్ కుమార్, యహసాన్, యోగానంద రెడ్డి, రెడ్డి శివకృష్ణ, సుధాకర, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

నేడు టి.సదుంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని నవాబుకోట, టి.సదుం గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించనున్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మహమూద్, మండల కన్వీనర్ కొట్టి మల్లికార్జున కోరారు.

కేవీపల్లె : వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మండలంలోని వగళ్ల కరీమా కల్యాణ మండపంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై కూటమి ప్రభుత్వ వైఫల్యాల గూర్చి వివరిస్తారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రేపు జీవన పరికరాలకు దివ్యాంగుల గుర్తింపు శిబిరం

కేవీపల్లె : దివ్యాంగులు, వయోవృద్ధుల సహాయం జీవన పరికరాల పంపిణీ కోసం భారత ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (ఏఎల్ఐఎంసీఓ) ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు కేవీపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. జీవన పరికరాలకు అర్హత గల దివ్యాంగులు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. శిబిరానికి హాజరయ్యేవారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సదరం వైద్య ధ్రువీకరణ పత్రం, ఫోటోలు, మొబైల్ నెంబరు తీసుకురావాలని కోరారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యాశాఖ ఇచ్చిన జీఓ వెంటనే వెనక్కి తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుంకర చక్రధర్

పీలేరు రూరల్ : పాఠశాల ఆవరణల్లోకి తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు తప్ప ఏ ఇతర అనధికార వ్యక్తులను అనుమతించరాదని కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెంటనే వెనక్కు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర చక్రధర్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో గత వారం రోజులుగా హాస్టల్ బాట కార్యక్రమాన్ని చేపట్టి తద్వారా లోపాలు ఉన్నటువంటి అంశాలు వెలుగు చూస్తాయనే భయంతో హాస్టల్స్, పాఠశాలల్లోకి అనుమతి లేదని కూటమి ప్రభుత్వం జీవో తేవడం సరైంది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యార్థి యువజన సంఘాలతో కలసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి భువనేశ్వర్‌రెడ్డి, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు లోకనాథం, నాయకులు లోకనాథరెడ్డి, రవిచంద్రారెడ్డి, రవి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జయచంద్రారెడ్డి నోరు అదుపులో పెట్టుకో

- కన్నెమడుగు దాయాదుల జోలికొస్తే సహించం
- కులదైవం వీరభద్రస్వామి గుడిపై మాట్లాడితే ఊరుకునేది లేదు
- రవిశంకర్‌రెడ్డి(చినబాబు)



మాట్లాడుతున్న కన్నెమడుగు దాయాదులు

మదనపల్లె రూరల్ : తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని, కన్నెమడుగు దాయాదుల ప్రస్తావన తెచ్చినా, కుల దైవం వీరభద్రస్వామి గుడి జోలికొచ్చినా ఊరుకునేది లేదని రవిశంకర్‌రెడ్డి(చినబాబు) హెచ్చరించారు. బుధవారం తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కన్నెమడుగు చినమాచిరెడ్డిపల్లెకు చెందిన దాయాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తమ కులదైవం, ఇలవేల్పు అయిన ఆవుదేవర దేవస్థానంలో శ్రీ వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవంకు సంబంధించి కన్నెమడుగు దాయాదులపై టీడీపీ నాయకులు జయచంద్రారెడ్డి చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి నియోజకవర్గంలోని మల్లయ్యకొండ, చినమాచిరెడ్డిగారిపల్లె వీరభద్రస్వామి ఆలయంతో పాటు అనేక దేవాలయాల అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. కన్నెమడుగు దాయాదులకు ఇంగిత జ్ఞానం లేదని విమర్శించిన జయచంద్రారెడ్డికి, ఇటీవల సీఏ ఫలితాల్లో దేశవ్యాప్తంగా ప్రతిభ కనపరిచి రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం పొందిన ఆడబిడ్డ తమ కుటుంబానికి చెందినదేనని గుర్తుచేస్తున్నామన్నారు. సమావేశంలో కన్నెమడుగు దాయాదులు శ్రీనివాసరెడ్డి, సుధాకరరెడ్డి, బిందుసాగర్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, యుగంధరరెడ్డి, టీచర్ చిన్నరెడ్డి, రమణారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు







గాయపడిన సంతోష్, నంజమ్మ, గాయపడిన బీహార్ కూలీలు

మదనపల్లె రూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో అరుగురు తీవ్రంగా గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ చదువుతున్న తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు పంచాయతీ రామిగానిపల్లెకు చెందిన విద్యార్థి సంతోష్(18), స్నేహితులు ఖాజా నవాజ్(18), అనిల్‌కుమార్(20) కలిసి ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. పుంగనూరు రోడ్డులోని ఆదిత్య కాలేజీ సమీపంలో టాటా ఏస్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం సంతోష్, ఖాజా నవాజ్‌లను మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పీటీఎం మండలం తిమ్మిరెడ్డిపల్లెకు చెందిన నంజమ్మ(80) స్థానికంగా రోడ్డులో నడిచి వస్తున్నారు. ద్విచక్రవాహనానికి నంకు కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి ఈ వృద్ధురాలిని ఢీకొంది. ప్రమాదంలో నంజమ్మ తీవ్రంగా గాయపడటంతో బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. మదనపల్లె రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్న బీహార్‌కు చెందిన దీపక్(25), సుశీ(23) చౌడేపల్లె సమీపంలోని ఓ హోటల్‌లో పనిచేస్తుంటారు. వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వస్తున్నారు. బైపాస్‌రోడ్డులో వాహనం అదుపుతప్పి కిందపడి గాయపడ్డారు. స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

పెద్దతిప్పసముద్రం : టీకాల కంటే తల్లి ముర్రుపాలు బిడ్డ సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని కందుకూరు సెక్టార్ పరిధిలో ఉన్న ఉయ్యాలవారిపల్లిలోని అంగన్‌వాడి కేంద్రంలో ఆమె పాల్గొని గర్భవతులు, బాలింతలతో సమీక్షించారు. తల్లి పాల ప్రాముఖ్యతను క్షుణంగా వివరించారు. మద్దిరెడ్డిపల్లి, కాట్నగల్లులోని అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఔషధం

బి.కొత్తకోట : తల్లిపాలు పుట్టిన బిడ్డకు దివ్య ఔషధమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయరాణి అన్నారు. బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లులు, గర్భిణీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టినబిడ్డకు తల్లిపాలిస్తే అందులోని పోషకాలు బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుతాయన్నారు. గర్భిణీ సమయంలో తల్లి తగిన పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు అందిస్తున్న పౌష్టికాహారం క్రమం తప్పకుండా కోటా తీసుకుని తినాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, అరుణ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష

ములకలచెరువు : తల్లిపాలు పురిటి బిడ్డకు శ్రీరామ రక్ష అని ఐసీడీఎస్ సూపర్ వేజర్ మౌలాబి అన్నారు. బుధవారం మండలంలోని చౌడసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వేజర్ మాట్లాడుతూ... తల్లిపాలు బిడ్డకు వ్యాధినిరోధక శక్తి పెంచుతుందని, గర్భిణులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్య భద్రత పట్టించుకోరా?



కస్తూర్బా బాలికా విద్యాలయం

పెద్దతిప్పసముద్రం : కస్తూర్బా బాలికా విద్యాలయాల్లో చదువుతున్న బాలికలకు ఆరోగ్య భద్రత కరువైంది. జిల్లా వ్యాప్తంగా 22 కస్తూర్బా స్కూళ్ళు ఉండగా 11 స్కూళ్ళలో ఏఎస్ఎంలు లేరు. ప్రధానంగా బాలికలు మాత్రం చదివే ఈ స్కూళ్ళలో పిల్లలకు అనారోగ్య సమస్యలు తలెత్తితే అక్కడ పని చేసే సిబ్బంది పడరాని పాట్లు పడాల్సిన దుస్థితి నెలకొంటోంది. ఈ స్కూళ్ళన్నీ నివాస గృహాలకు కిలోమీటర్ దూరంలో ఉండటం, అనారోగ్య సమస్య తలెత్తినప్పుడు సిబ్బంది పిల్లలతో నడచుకుంటూ మండల కేంద్రానికి వచ్చి చికిత్స చేయించాల్సిన దుస్థితి నెలకొంటోంది. ఇక రాత్రి సమయాల్లో బాలికలకు అత్యవసరంగా అనారోగ్య సమస్య తలెత్తితే బాలికల ఆరోగ్య భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారని పిల్లల కన్నవాళ్ళు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడెక్కడో దూర ప్రాంతాల నుంచి కన్నవాళ్ళను వదలి బాలికలు స్కూళ్ళలో విద్యనభ్యసిస్తున్నారు. జిల్లాలోనే సగం కస్తూర్బా స్కూళ్ళలో వైద్య సేవలందించే ఏఎస్ఎం పోస్టులు భర్తీ కాకపోవడం శోచనీయం. బాలికల ఆరోగ్య భద్రతపై ప్రభుత్వం ఏ మేరకు దృష్టి సారించిందో దీన్ని బట్టి చూస్తే స్పష్టంగా తెలుస్తోంది. ఈ విషయంపై జిల్లా జీసీడ్యో శిరీషను వివరణ కోరగా జిల్లాలో 11 ఏఎస్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తే ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ అవుతాయన్నారు.

పేదరికం పోవాలంటే.. మళ్లీ జగనన్న రావాలి



క్యూఆర్ కోడ్ కరపత్రంతో ప్రజాభిప్రాయం తెలుసుకుంటున్న నాయకులు

తంబళ్లపల్లె : రాష్ట్రంలో పేదరికం పోవాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్న రావాలని మహిళలు, ప్రజలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని గోపిదిన్నె, పరసతోపు పంచాయతీల్లోని పలు పల్లెల్లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్తూ క్యూఆర్ కోడ్ కరపత్రాలు పంచుతూ ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పేరుతో హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న పాలనలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో ప్రతి పల్లెలకు తారు, సిమెంటు రోడ్లు, పలు దేవాలయాల అభివృద్ధి, ప్రాజెక్టులు తీసుకువచ్చిన ఘనత ద్వారకనాథరెడ్డిదేనన్నారు. రాజకీయ పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హులైన వారి అందరికి సంక్షేమ పథకాలు అందించి అభివృద్ధి పనులను పరుగులు పెట్టించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. మళ్లీ మళ్లీ ఆయనే రావాలంటూ ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపిపి కరీమ్, ప్రజాప్రతినిధులు, నాయకులు కోటిరెడ్డి, భాస్కర్‌రెడ్డి,శ్రీనివాసులు, ప్రభాకర్‌రెడ్డి, గురివిరెడ్డి, ఆనందరెడ్డి, నారాయణరెడ్డి, కిషోర్‌రెడ్డి, మధు, రాజేష్, రామమూర్తి, మల్లిరెడ్డి, శివారెడ్డి, చిన్నరెడ్డప్ప, పద్మనాభరెడ్డి, మల్లికార్జున, తాళ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లేగదూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్ పిళ్లై



మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్ పిళ్లై

కలికిరి : పాడి రైతులు లేగదూడల పెంపకం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్ పిళ్లై అన్నారు. మండలంలోని మర్రికుంటపల్లి గ్రామంలో బుధవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా పశుగ్రామీణాభివృద్ధి, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పశువైద్యాధికారి మాట్లాడుతూ మండల పరిధిలో రైతులు ఎక్కువగా పాడి పరిశ్రమపై ఆధారపడివున్నారని, లేగ దూడల పెంపకంపై కొంత ప్రత్యేక దృష్టి సారిస్తే మరింత లాభదాయకంగా వుంటుందన్నారు. లేగ దూడల పెంపకానికి మినరల్ మిశ్చర్ పంపిణీ చేశారు. దూడల ప్రదర్శనలో మూడు ఉత్తమ జాతి దూడలను ఎంపిక చేసి రైతులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ మదనపల్లి డివిజన్ ఏడీఏ డా. శ్రీనివాసులునాయుడు, కలికిరి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీఏ డా. వెంకటమునినాయుడు, పశుగణాభివృద్ధి సంస్థ అధికారి డా. చిరంజీవి, పశువైద్యాధికారులు డాక్టర్ కీర్తి, డాక్టర్ జగన్‌మోహన్ రెడ్డి, డాక్టర్ గిరినాథ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ హెచ్‌ఎంలకు ఎంఈఓ పోస్టులు కేటాయించాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మదనపల్లె సిటీ : మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పని చేసే ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ-1,2, పోస్టులను కేటాయించాలని యూటీఎఫ్ నాయకులు బుధవారం ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం కేవలం ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మాత్రమే ఎంఈఓ పోస్టులు భర్తీ చేస్తున్నారన్నారు. దీని వల్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు నష్టపోతున్నారన్నారు. అదే విధంగా కోర్టు కేసుల వల్ల నిలిచిపోయిన మున్సిపల్ భాషా పండితులకు కూడా అడ్‌హక్ పద్ధతిన ప్రమోషన్లు కల్పించి, సీనియారిటీ కోల్పోకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ, ఎగవింటి సుధాకర్, పయని, రవీంద్ర, శీనప్ప,కుమార్, రాము జిలాన్‌బాష, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందివ్వాలి

కలికిరి : ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందివ్వాలని పీలేరు ఎమ్మెల్యే కిశోర్ కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన ప్రభుత్వాసుత్రి భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలికిరి సామాజిక ఆరోగ్య కేంద్రం 30 నుంచి వంద పడకల ఆసుపత్రిగా మార్చడానికి కృషి చేస్తానన్నారు. టి.బి. రోగులకు నెలకు రూ.వెయ్యి పౌష్టికాహార సాయం అందచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రమేష్‌బాబు, సింగిల్ విండో అధ్యక్షులు నల్లారి చంద్రకుమార్‌రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పవన్‌కుమార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ వెంకటరమణ, అస్లాం బాషా, గీత, వైద్యాధికారులు ఉదయ్‌కుమార్, వెంకటేష్, సిమ్రాన్, ఆశాలత, శశి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• ఆకాశ హరివిల్లు



సప్తవర్ణాల ఇంద్ర ధనస్సు బురకాయలకోట సమీపంలోని కొండల్లో బుధవారం సాయంకాలం కనువిందు చేసింది. వర్షపు జల్లులు సూర్యాస్తమైన సమయంలో సూర్య కిరణాల వెలుగుతో ఈ ఇంద్ర ధనుస్సు ఏర్పడింది. ఆకాశంలో ఈ సప్తవర్ణాల ఇంద్రధనుస్సు మధ్యలో చంద్రుడు సైతం దర్శనమివ్వడంతో స్థానికులను ఆకట్టుకుంది. – ములకలచెరువు